
నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 15 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

అవయవదానంతో..

# 6 మందికి ప్రాణదానం

- మరణించిన డాక్టర్ భూమిక చిత్రపటానికి నివాళి
- ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



వివరాలు 8లో

పుష్పయాగంతో అత్యంత వైభవంగా ముగిసిన

## కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ముసునూరు హనుమత్ క్షేత్రంలో ఈనెల 6న తోమాల సేవతో ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం పుష్పయాగంతో అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయ వ్యవస్థాపకులు, ప్రధానార్చకులు వేదగిరి సూర్యనారాయణా చార్యులు నేతృత్వంలో తిరుమల వేద పండితులు మురళి, త్రినాథ్ తదితరుల ఆధ్వర్యంలో 8 రోజుల పాటు పూజా క్రతువులు వైభవంగా జరిగాయి. గురువారం రాత్రి శ్రేదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు తులసీ సహిత ఇరవై ఒక్క రకాల పుష్పాలతో వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పుష్పయాగం జరిగింది. ఉభయకర్తలకు, తరలి వచ్చిన భక్తులకు అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహంతో కావలి పట్టణానికి, ప్రజలకు మేలు జరగాలని ప్రధానార్చకులు సూర్య నారాయణ ఆచార్యులు ఆకాంక్షించారు. గ్రామోత్సవాల్లో సహకరించిన ముసునూరు, కావలి పాతఊరు, శాంతినగర్, వెంగళరావు నగర్, బాపూజినగర్ పలు ప్రాంతాల ఉభయకర్తలకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉభయకర్తలకు మత్స్యవతారం విష్ణుమూర్తి చిత్రపటాలను అందజేశారు.

బీసీల సంక్షేమమే..

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

- బీసీ సబ్సిడీ రుణాల దరఖాస్తు చేసుకునేందుకు 15 వరకు పొడిగింపు
- బుచ్చి పట్టణానికి ఫైర్ స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ధన్యవాదాలు
- మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం కల్పిస్తున్న సబ్సిడీ రుణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుచ్చి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి కోరారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీసీ రుణాల దరఖాస్తుకు ఈనెల 15 దాకా ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. బలహీన వర్గాలకు బిసి కార్పోరేషన్ ద్వారా స్వయం ఉపాధి కల్పనకై ప్రభుత్వం కల్పిస్తున్న రుణ సదుపాయాన్ని బిసి సోదర సోదరీమణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన 21 సంవత్సరాలు దాటి 60 సంవత్సరములలోపు వయసున్న ప్రతి ఒక్కరు రుణ దరఖాస్తుకు అర్హులేనన్నారు. ప్రభుత్వం ప్రారంభిన ఈ పథకం అందుకోవడానికి తెల్లరేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన ఒక కుటుంబంలో ఒక్కరు మాత్రమే లబ్ది పొందుటకు అర్హులని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి తెలిపారు. అనంతరం -మిగతా 2లో

సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన

## స్పెషలాఫీసర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతినెల మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్'లో భాగంగా కందుకూరు నియోజకవర్గం పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్న సందర్భాన్ని పురస్కరించుకొని కందుకూరు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ యం.సూర్య తేజ శుక్రవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో పలు కార్యక్రమాలకు -మిగతా 2లో

1060 మంది సిబ్బందితో..

# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



— జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ —

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా 1060 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. శనివారం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్న సందర్భంగా కందుకూరులోని ఎస్‌వీఎస్ కళ్యాణ మండపంలో శుక్రవారం ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయి బందోబస్తును మ్యాప్ ద్వారా క్షుణ్ణంగా వివరిస్తూ బ్రీఫింగ్ నిర్వహించారు. అందరూ సమయపాలన పాటిస్తూ, డ్యూటీ పాస్‌పోర్ట్‌లో ఎవరికి నిర్ణయించిన ప్రదేశాలల్లో వారు తప్పక హాజరు కావాలన్నారు. ఎవరైనా గైర్హాజరు అయినట్లయితే తప్పకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిఐపి కాన్వాయ్, కంటిన్‌జెంట్ ప్లాన్‌తోపాటు బందోబస్తు కూర్పు చేసి, ప్రధానంగా ట్రాఫిక్ కాంపోనెంట్‌తో పాటు అన్ని సెక్టార్‌లు, రూట్, రూఫ్ టాప్ బందోబస్తులు పటిష్టం చేయడం జరిగిందన్నారు. కల్వర్ట్ చెకింగ్, బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో యాంటీ సబోటేజ్ చెకింగ్, ఆర్ఒపి, కూంబింగ్‌లు క్షుణ్ణంగా నిర్వహించాలని, వ్యతిరేక దిశలో వాహనాల కదలికలు పూర్తిగా నిరోధించాలని, వీవీఐపీలు బస చేసే ప్రదేశాలను వంద శాతం చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా, పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలు నిలుపుకునేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ మాన్ ప్యాక్‌ను గమనిస్తూ ఉండాలన్నారు. అందరికీ వసతి, భోజనాలు ఏర్పాటు -మిగతా 2లో

# కేంద్ర బడ్జెట్‌పై నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపు

**కావలి, మేజర్‌న్యూస్ :** కేంద్ర ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శుక్రవారం కావలి సీపీఎం ఆఫీసులో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్య వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు, కార్మికులకు, శ్రామికులకు ఉపయోగపడే బడ్జెట్ కాదని,బడా పారిశ్రామిక వ్యక్తులకు లాభాలు చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ ఉన్నదన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం కొరకు ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిననిధులు కేటాయించలేదన్నారు. రైతులు పండించిన పంటకు సమగ్ర చట్టం చేయలేదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు పరుగులు తీస్తున్నదన్నారు. మన రాష్ట్రానికి రావాల్సినవిభజన హామీలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేసేది లేదని ఎక్కడ హామీ ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్ ఆదాని, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు రాయితీలు చేకూర్చే విధంగా ఉన్నదన్నారు. ఈ బడ్జెట్ శ్రామికవర్గానికి పొట్టకొట్టే విధంగా ఉందన్నారు. ఇప్పటికే అధిక ధరలు, కరెంటు చార్జీలు రకరకాల యూజర్ చార్జీలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచే విధంగా బడ్జెట్ ఉండాలన్నారు. పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేవిధంగా ఉండటం చాలా దుర్మార్గమ న్నారు. బడ్జెట్లో సవరణలు చేయాలని ప్రజలకు, శ్రామికులకు, రైతులకు ఉపయోగ పడేలా ఉండాలని



డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు బలిజెపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు సరైన ధర కల్పించలేదన్నారు. ఈ బడ్జెట్ రైతులకు తోడ్పడే విధంగా లేదన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని పాలకులు చెబుతూ రైతుల నడ్డి విరిచే విధంగా సంస్కరణలు చేస్తున్నారన్నారు. మాటలకే పరిమితం అవుతున్నారన్నారు. ప్రజలకు కూడా ఉపయోగపడే బడ్జెట్ కాదని, అధిక ధరలు తగ్గించడంలో పాలకులు విఫలం అవుతున్నారన్నారు. ప్రజలకు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాల ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ఏమీ కాదన్నారు. దీనిపై వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు రకరకాల పద్ధతులలో నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ నాయకులు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నాయని, ఎన్నో బడ్జెట్లు ప్రవేశ పెట్టారని, ఇప్పటికీ పేదలు నివసించే ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయన్నారు. సక్రమంగా రోడ్లులేవని, తాగేందుకు పుష్కలంగా నీళ్లు లేవన్నారు. కడుపునిండా తిండి తినేందుకు డబ్బులు లేక ఇంకా ఇబ్బందులు పడే పేదలు ఉన్నారని ఈ ప్రభుత్వాలు మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నా రన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఆమోదకరమైనది కాదన్నారు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, దీనిపై వామపక్ష పార్టీలు కలిసి పోరాటాలు కొనసాగిస్తామన్నారు.ప్రజలు కూడా సమైక్యంగా పోరాటాలలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పిడిఎఫ్ మాజీ నాయకులు కరవది భాస్కర్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎల్.శ్యామలమ్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూదన్ రావు, సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, సిపిఐ నాయకులు కె.నాగరాజు, దర్గాబాబు, రావికోటిరెడ్డి, డివైఎఫ్ఐ, వ్య.కా.సం నాయకులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాలను సుస్థిర వ్యవస్థలుగా మార్చే ప్రణాళికలు అమలు

**అదనపు కమిషనర్ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** పట్టణాలలోని పేద మహిళల చేత ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యలను సుస్థిర వ్యవస్థలుగా తీర్చిదిద్ది, తద్వారా సుస్థిరమైన జీవనోపాదుల కల్పన ద్వారా మహిళల కుటుంబ తలసరి ఆదాయాన్ని పెంచే ప్రణాళికలను అమలుపరిచేందుకు సిద్ధంగా ఉన్నామని నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వై.ఓ.నందన్ తెలియజేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మిషన్ డైరెక్టర్ ఎం.తేజ్ భరత్ ఆధ్వర్యంలో పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలకు మెప్మా కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొని వివిధ మెప్మా కార్యక్రమాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిషన్ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. మెప్మా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు, వారి కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా వారి వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించి, ఆర్థిక సాధికారత కల్పించనున్నామని తెలిపారు. అసంఘటిత రంగంలో స్వయం ఉపాధి, ఇతర సేవల ద్వారా ఉపాధిని పొందుతున్న స్వయం సహాయక సంఘ సభ్యులు, వారి కుటుంబ సభ్యులను సంఘటిత రంగంలోకి మార్చేందుకు మొదటి మెట్టుగా ఎంఎస్ఎమ్ఈలుగా వారిని రిజిస్ట్రేషన్ చేయనున్నామని తెలిపారు. ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ ద్వారా వృత్తికి, వ్యాపార అభివృద్ధికి హామీలేని సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు, కేంద్ర ప్రాజెక్టు రుణాలు పొందేందుకు అవకాశం ఉందని వివరించారు. చేస్తున్న వృత్తి వ్యాపారాలకు పూర్తి చట్టబద్ధత కల్పించనున్నామన్నారు. నైపుణ్య అభివృద్ధి పొందేందుకు, విస్తృతమైన మార్కెట్‌ను అందుకునేందుకు, బ్రాండింగ్ సహకారం పొందడానికి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తుందని వివరించారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు లేదా వారి కుటుంబ సభ్యులకు రుణాలను అందించే ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయనున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న సభ్యులకు వారి అర్హతలను నిర్దేశించిన కమిటీ పరిశీలించాక సబ్సిడీతో కూడిన రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. రుణం పొందిన తరువాత దరఖా స్తులో పేర్కొన్న యూనిట్ ఏర్పాటు చేసుకొని కుటుంబ ఆర్థిక స్థితిని పెంచడం తోపాటుగా తలసరి ఆదా యాన్ని కూడా పెంచుకోవాలని సూచించారు. రుణాలు పొందేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాల ను మెప్మా సంస్థ కల్పిస్తుందని, అన్ని విషయాలలో వారి నుంచి సహాయ సహకారాలు పొందాలని మహిళలకు సూచించారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 సందర్భంగా మార్చి 8వ తేదీ ఒకేరోజు లక్ష ఉత్పత్తులకు పైగా అమ్మకం జరపడం ద్వారా కోటి రూపాయలకు పైగా ఆదాయం సంఘ సభ్యులకు వచ్చేలా చేయుటకు ప్రణాళికలను సిద్ధం చేసి ఉన్నామని తెలిపారు. ఒక్కొక్క స్వయం సహాయక సంఘాల నుంచి అదే మున్సిపాలిటీ నుంచి ఓఎండిసిలో ఆన్‌బోర్డ్ అయిన ఒక ప్రోడక్ట్ కొని సంఘం ఉత్పత్తులను ప్రోత్సహించుటకు ప్రణాళికను రూపొందించామని తెలిపారు. మార్చి 8వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి, పట్టణ పుర పాలక శాఖ మంత్రి గిన్నిస్ ప్రతినిధుల సమక్షం లో లక్ష ఉత్పత్తుల అమ్మకాలు విజయవంతంగా జరగాలని ఉన్నామని తెలిపారు. అన్ని మున్సిపాలిటీలలో పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అక్కడ గిన్నిస్ ప్రపంచ రికార్డును ఆన్లైన్ ద్వారా సంఘ సభ్యులు వీక్షించే సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ టీపీఆర్వో బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన భానుప్రకాష్

**అభినందించిన అదనపు కమిషనర్**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ వార్డు ఎడ్యుకేషన్ మరియు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కొత్తకోట భానుప్రకాష్, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ 2024-25వ సంవత్సరానికిగాను వరుసగా మూడవసారి ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ హాకీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ వైఓ నందన్.. భానుప్రకాష్‌ను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ గౌరవాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. క్రీడాకారుడు భానుప్రకాష్ మాట్లాడుతూ.. మొదటిగా హర్యానాలోని కురుక్షేత్రా 2022 సంవత్సరంలో, ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్లో 2024లో జరిగిన క్రీడల లో ఎంపికై జట్టు విజయానికి కృషి చేశానని తెలిపారు. అదేవిధంగా 2025వ సంవత్సరం ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు జట్టులో స్థానం సంపాదించానని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాకినాడ ఆస్ట్రోటఫ్ హాకీ గ్రౌండ్లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్, కేంద్ర సివిల్ సర్వీసెస్ సంయుక్తంగా ఈనెల 15 నుండి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారని తెలిపారు.

## బీసీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

*(మొదటి పేజీ తరువాయి)*

ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి బుచ్చి పట్టణానికి ఫైర్ స్టేషన్ మంజూరు అయ్యేందుకు కృషి చేసిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి బుచ్చి నగర పంచాయతీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఫైర్ స్టేషన్ నిర్మాణానికై 1 కోటి 43 లక్షల 94 వేల 790 రూపాయల నిధులు మంజూరు అయ్యాయని ఆమె వెల్లడించారు. ఫైర్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన టెండర్లు కూడా పూర్తయ్యాయని అగ్ని మాపక కేంద్ర నిర్మాణంతో ఒక్క బుచ్చి పట్టణమే కాకుండా పరిసర గ్రామాలలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారించేందుకు వీలుంటుందన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల సహాయ సహకారాలతో తాను ఛైర్ పర్సన్‌గా ఉన్న సమయంలో బుచ్చి పట్టణ అభివృద్ధికి సంబంధించిన మౌళిక సదుపాయాలు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్లు ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, పటాన్ నస్రిన్, 11వవార్డ్ కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ పాల్గొన్నారు.


## సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన స్పెషలాఫీసర్

*(మొదటి పేజీ తరువాయి)*

సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా శానిటేషన్ పనులు, సివిల్ వర్క్స్, జంగల్ క్లియరెన్స్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా స్థానిక ఏఎంసీ మార్కెట్ యార్డు మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఏర్పాటు చేయనున్న స్టాల్స్, ఇతర ఏర్పాట్లపై నియమింపబడిన ప్రత్యేక అధికారులతో కమిషనర్ చర్చించి వివిధ సూచనలను జారీ చేశారు. స్థానిక దూబగుంట గ్రామం పరిధిలోని ప్రజా పార్కులో విద్యార్థులతో ముఖ్యమంత్రి మమేకమయ్యే సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసే విధంగా చేపట్టాల్సిన పెయింటింగ్స్, ఇతర కార్యక్రమాలను కమిషనర్ పర్యవేక్షించారు.

## 1060 మంది సిబ్బందితో..
## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

*(మొదటి పేజీ తరువాయి)*




చేయడం జరిగిందన్నారు. డీ బ్రీఫింగ్ అయ్యేంత వరకు విధులలోనే ఉండాలన్నారు. అందరు అప్రమత్తంగా ఉండి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి బందోబస్తును కొత్తగా చేస్తున్నామనే ఉద్దేశంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రధాన కూడళ్ళలో బ్యారికేట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించనున్న అన్నీ ప్రదేశాలలో పూర్తిస్థాయి కాన్వాయి ట్రయిల్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) మునిరాజ, డీఎస్పీలు శ్రీనివాసులు, సింధు ప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, చెంచు రామారావు, శ్రీధర్, సిఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీలు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో 27, 28న నేషనల్ సైన్స్ డే వేడుకలు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఓపెన్ హౌస్ 2025 కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించను న్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రత్యక్ష ప్రయోగాలు విజ్ఞాన ప్రదర్శనలు, పోటీలు ఈ ఏడాది కార్యక్రమానికి 'విక్సిట్ భారత్ కోసం భారత యువతకు గ్లోబల్ సైన్స్, ఇన్నోవేషన్ నాయకత్వాన్ని అందించడం" అనే థీమ్‌ను నిర్ణయించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కరరావు మాట్లాడుతూ.. 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు, డిగ్రీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజ్ఞాన ప్రదర్శనలు, ప్రత్యక్ష ప్రయోగాలు, పోటీల ద్వారా తమ శాస్త్రీయ అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే భారత యువత గ్లోబల్ సైన్స్, ఇన్నోవేషన్ రంగాల్లో నాయకత్వం వహించాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కోట నీల మణికంఠ, డీన్ సీడీసీ డాక్టర్ ఎం.హుస్సేనయ్య, డాక్టర్ ఎన్ఓ గోపాల్, డాక్టర్ సీఎస్ సాయి ప్రసాద్ రెడ్డి, ఎఫ్ఓ సిహెచ్. చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల నిర్మాణాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే ప్రధాన సాగునీటి పనరులైన వెలిగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు బడ్జెట్లో ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో రైతు సంఘం, సీతారాంసాగర్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.7వేలకోట్లు నిధులు బడ్జెట్లో కేటాయించాలన్నారు. సాగునీటి వసతి ఈ ప్రాంతంలో సరిగా లేకపోవడంతో పలు కుటుంబాలు పొట్టచేతపట్టుకుని బ్రతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ఇప్పటికి ఎంతోమంది. పాలకులు, ప్రభుత్వాలు మారినా బడ్జెట్‌లోని ధులు కేటాయించకపోవడంతో నిర్మాణపనులు ఎక్కడవేసిన గొంగలి అక్కడే పున్నట్టు వున్నాయన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో రూ.394 కోట్లు కేటాయించడం మరి దారుణంగా వుందన్నారు. త్వరలో జరిగే బడ్జెట్ సమావేశాల్లోనైనా నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయించకుంటే అందోళనను చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రైతులు చిన్నపరెడ్డి ప్రసాద్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# డీబీఎస్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని స్థానిక మద్దూరు పాడులో ఉన్న డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే బ్లడ్ క్యాంప్‌ను నిర్వహించారు. స్వచ్ఛందంగా రక్తదానాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు ఆటలు ఆడడం వలన తమ మేధాశక్తిని పెంచుకోనేందుకు ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వశిష్ట జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా అనేది శారీరిక శ్రమ లేదా ఆట యొక్క ఒకరూపం అని తరచుగా క్రీడా పోటీలు యువకులు పాల్గొనడం వలన శారీరిక సామర్థ్యం, నైపుణ్యతను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని తమ మేధాశక్తిని పెంపొందించేందుకు ఆరోగ్యపరంగా దృఢత్వం కలిగి ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. అలాగే కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీవీ రావు మాట్లాడుతూ.. విద్యార్థిని, విద్యార్థులు మానసికంగా, శారీరకంగా క్రీడల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.రమేష్ బాబు కలిపి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫిజికల్ డైరెక్టర్ పాలేటి మహేంద్ర బాబు పాల్గొన్నారు.



# చిన్నక్రాకలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం చిన్నక్రాక గ్రామంలో బస్ షెల్టర్ వద్ద ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వస్తున్న శుభ సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించి వేశారు. ఫ్లెక్సీని భారీగా చించడంతో మండలంలో ఈ విషయం చర్చినీయంశంగా మారింది.

# బీసీ, కుమ్మర, మేదర కులాలకు స్వయం ఉపాధి రుణాలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.నిర్మలాదేవి శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా అధికారి ఆదేశాల మేరకు సైదాపురం మండలం ఎంపీడీవో పురుషోత్తం శివ కుమార్ మండలంలోని కుమ్మర, మేదర శాలివాహన కుటుంబల వారు బీసీ కులాలకు సంబంధించి కుమ్మరి (కుండలు తయారీ) మేదర (ఎదురు బుట్టలు తయారీ) వారు మాత్రమేనని తెలిపారు. స్వయం ఉపాధి రుణాలకు సంబంధించి కుమ్మరి సాలి వాహనాలకు 50మందికి రూ.1.5 కోట్లు, మేదరులకు 50 మందికి రూ.1.5 కోట్లు, మొత్తం 100 మందికి రూ.3 కోట్లు రుణం అందిస్తారని తెలిపారు. ఇందులో వ్యక్తిగతంగా కాకుండా గ్రూపులుగా ఏర్పడాలని ఒక్కొక్క గ్రూపులో మూడు నుంచి ఐదు మంది సభ్యులుగా ఉండాలని తెలిపారు. ఒక్కొక్క గ్రూపు యూనిట్ విలువ రూ.3లక్షలు ఉంటుందని ఇందులో 50శాతం ప్రభుత్వ సబ్సిడీ గాను, 50శాతం బ్యాంకు రుణం గాను అందిస్తారని తెలిపారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆదాయ, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సైదాపురం మండల ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు.

# అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేకు వినతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాలెం గ్రామంలో ప్రస్తుతం వున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని మండల ఉపాధ్యక్షులు గుంటుపల్లి, మాలకొండయ్య చౌదరి శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల, సురేషుకు వింజమూరులోని ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందించి విన్నవించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో లోడ్ ఎక్కువై రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో 25 మోటర్లకు విద్యుత్ సరఫరాచేసి సామర్థ్యం కలిగిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించిన డీడీలు రైతులు చెల్లించి విద్యుత్ శాఖకు చెల్లించారన్నారు. రైతుల శ్రేయస్సు దృష్టిలో వుంచుకుని ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయించేందుకు సహకరించాలన్నారు. ఈయన వెంట మాజీ ఎంపీటీసీ సభ్యులు పాముల రమణయ్య ఉన్నారు.

## అంగన్వాడి కార్యకర్తలకు పోషణ భీ పడాయి భీ పై శిక్షణ




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ నెల్లూరు ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి కార్యకర్తలకు పోషణ భీ పడాయి భీ రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బాలబాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతిగా నమోదు అయిన రోజు నుండి బిడ్డకు 24 నెలలు పూర్తి అయ్యే వరకు గల 1000 రోజుల సంరక్షణ గురించి, అంగన్వాడి కేంద్రాలలో 0 నుడి 5 సంవత్సరాల లోపు పోషణ పిల్లలను గుర్తించి వారిలో పోషణ మీద దృష్టి పెట్టాలని, బిడ్డకు మొదటి 6నెలల వరకు తల్లి పాల యొక్క ప్రాముఖ్యత గురించి అలాగే 7వ నెల నుండి తల్లి పాలతో పాటు బిడ్డకు ఇవ్వవలసిన అనుబంధ పోషకాహారం గురించి వివరించారు. అలాగే అంగన్వాడి కేంద్ర పరిధిలోని దివ్యంగ పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం అందించే సేవల గురించి తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీడీపీఓ కే.లక్ష్మీదేవి, ప్రాజెక్టు సూపర్వైజర్‌లు స్వరూప, సుకన్య, నాగలక్ష్మి దేవమ్మ, లక్ష్మీ రాజ్యం, కవిత పాల్గొన్నారు.

# రైతులు పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలి

▸ ధాన్యంకొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం వ్యవసాయ సహకార సంఘం పరిధిలోఉన్న రైతుసేవా కేంద్రంలో జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా సహకార అధికారి గుర్రప్ప, ఇందుకూరుపేట సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి డి.రఘునాథరెడ్డి, స్థానిక సహకార సంఘం సీఈవో ఆధ్వర్యంలో ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి గుర్రప్ప మాట్లాడుతూ.. రైతులందరూ కూడా తాము పండించిన ధాన్యాన్ని బయట మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకోకుండా, కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవాలని ఆయన తెలియజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇందుకూరుపేట సబ్ డివిజన్ల పరిధిలో 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. ఇందుకూర పేట మండలంలో12 కేంద్రాలు, తోటపల్లి గూడూరు మండలంలో 14 కేంద్రాలు ముత్తుకూరు 9కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బయట మార్కెట్లో దళారీలు మధ్య వ్యక్తుల వలన, రైస్ మిల్లర్ వలన రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకొని మోసపోకూడదని రైతుసేవ కేంద్రంలో అమ్ముకోవాలని తెలియజేశారు. ఒకవేళ బయట మార్కెట్లో అధిక ధర ఉంటే అమ్ముకోవచ్చునని తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించినమద్దతు ధరఈ సంవత్సరం ఒక కింటావరి ధాన్యానికి సాధారణ రకాలుకు 2,300 రూపాయలు ఉందని ,ఏ గ్రేడ్ ఒరి రకానికి 2320 ఉందని, సాధారణ రకాల పుట్టి ధర 19550/-, ఏ గ్రేడ్ వరి ధర 19720/- రూపాయలుగా ఉందని తెలియజేశారు. ప్రభుత్వం గోని సంచులు, అమాలీ చార్జీలు, ప్రభుత్వమే భరిస్తుందని ఆయన తెలిపారు. రైతులు ఖాతాలో నేరుగా డబ్బులు వేస్తుందని తెలియజేశారు. 24 గంటల నుంచి ఒక వారం లోపల అమ్మిన ధాన్యం రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలియజేశారు. రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే ధాన్యాన్ని బాగా ఎండబెట్టుకొని, రైతు సేవ కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి అక్కడ ఉన్న టెక్నికల్ వాళ్ళు వచ్చి ధాన్యాన్ని పరిశీలించి, తేమశాతం 17శాతంగా ఉన్నప్పుడు, చెత్తాచెదారం లేకుండా రాళ్లు రప్పలు లేకుండా, ధాన్యము ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలు లోబడి ఉంటే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని తెలియజేశారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకునే దానికి ఎలాంటి సమస్యలు ఉన్న జిల్లా జాయింట్ కలెక్టర్‌కి, జిల్లా పౌరసరఫరాల అధికారులకు రాష్ట్ర పౌర సరపర అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. టోల్ ఫ్రీ నెంబర్ 1967కి ఇచ్చి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నీటి సంఘం ఉపాధ్యక్షులు భక్తవత్సల నాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు దీక్షిత, తిరుమల, అనేకమంది రైతులు పాల్గొన్నారు.

## నేడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ

# దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

▸ ఎంపీడీవో సిహెచ్ శ్రీదేవి



**కావలి, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నేడు మూడవ శనివారం సందర్భంగా కావలి రూరల్ మండల పరిధిలోని 17 పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు, రోడ్లు శుభ్రపరచడం మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు చేపట్టి అనంతరం ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మూడు డస్ట్ బిన్‌లు ఎరుపు, ఆకుపచ్చ, బ్లూ, ఈ మూడు డస్ట్ బిన్‌లు ఏ విధంగా వాడాలి అనేది కూడా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. తడి చెత్తకు గ్రీన్ డస్ట్ పిన్, పొడి చెత్తకు రెడ్ డ్రస్ట్ పిన్, హానికరమైన చెత్తకు బ్లూ డ్రస్ట్ పిన్, వాడడంపై ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కార్యాలయ ఆవరణంలో ఉన్న పరిసరాలను అన్నిటిని కూడా పరిశుభ్రంగా చేసుకోవడం జరుగుతుందన్నారు. ఆ పరిసర ప్రాంతాలలో ఆకుపచ్చగా ఆహ్లాదకరంగా ఉండేందుకు మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క పంచాయతీ కార్యదర్శి కూడా వారి పరిధిలో ఉన్నటువంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# యువతిపై దాడి చేసిన ముద్దాయిని కఠినంగా శిక్షించాలి : సి.శారద



**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రేమికుల దినోత్సవం పేరుతో యువత తమ యవ్వన దశలో పక్కదారులు తొక్కుతూ మంచి చదువులు చదివి ఉన్నత స్థితిలో ఉండాల్సిన విద్యార్థిని, విద్యార్థులు తమ అనైక్యతతో వారి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు సి.శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా 23 ఏళ్ల యువతిపై ప్రేమపేరుతో గణేష్ అనే వ్యక్తి ఆ యువతీపై కత్తితో దాడి చేసి నోట్లో యాసిడ్ పోసి ప్రాణాలు తీసే అంత దౌర్భాగ్య స్థితికి దిగజారిన గణేష్ ప్రస్తుతం రాష్ట్రంలో సంచలనంగా మారిందని తెలిపారు. తాను ప్రేమించిన యువతికి పెళ్లి అని తెలిసే సరికి తనకు దక్కనిది మరొకరికి దక్కడం ఏమిటి అనే దురహంకారంతో సైకోగా ప్రవర్తించి ఈ దాడికి పాల్పడేలా చేసిందని తెలిపారు. వాలంటైన్స్ డే పేరుతో యువత పెడదారున తమ జీవిత గమ్యాన్ని మరియు లక్ష్యాన్ని ఏర్పరచుకొని రాజ బాటలో నడవాలి కానీ ఇలాంటి ప్రేమోన్మాదంలో పడకుండా వారి జీవితాలు ముళ్ళబాటలో కాకుండా చక్కని మార్గంలో నడిచేందుకు తమ ప్రయత్నాలు సాగించాలని తల్లిదండ్రులు బిడ్డల మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కాకుండా, అలాగే కాలేజీలో చదువుతున్న కాలేజీకి ఒక మంచి పేరును తీసుకురావాలని జీవిత విలువలు కూడా తెలుసుకోవాలని తెలిపారు. అలాగే పిల్లల తల్లిదండ్రులు వారి పద్ధతులను అలవాట్లను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండాలని విశ్రాంతి ఉపాధ్యాయులు శారద తెలిపారు.

## ఎస్‌డబ్ల్యూపీసీలను పరిశీలించిన ఎంపీడీఓ




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్పేట మండలంలోని పలు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీవో ప్రసన్న కుమార్ పరిశీలించారు. శనివారం జరగనున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీలలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ మేరకు ఏఎస్‌పేటలోని ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీడీపీఓ బాధ్యతల స్వీకరణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి అంగన్వాడీ ప్రాజెక్టు కార్యలయ ఇన్‌చార్జ్ సీడీపీఓగా ఎన్.సునీత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీడీ కార్యాలయంలో ఈఓ (ఎక్స్టెన్షన్‌అధికారిణిగా) పనిచేస్తూ పీడీ అదేశాల మేరకు ఇక్కడ ఇన్‌చార్జ్ సీడీపివోగా భాధ్యతలు చేపట్టానన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. తనవిధులు బాధ్యతగా నిర్వహిస్తానన్నారు. కార్యకర్తలు విదుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు అంగన్వాడీ కేంద్రాల్లోని లబ్దిదారులకు కార్యకర్తలు అన్నీ సేవలు అందించాలన్నారు.

## స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వామ్యం కావాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ, కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో శనివారం నిర్వహించే స్వర్ణా ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని అపరిశుభ్రతను తొలగించి, శుభ్ర పరచాలన్నారు.

**మేదర, కుమ్మరి సబ్సిడీ యూనిట్లు మంజూరు :** ఉదయగిరి మండలానికి సంబంధించి మేదర, కుమ్మరి కులాలకు ఒక్కొకటిచొప్పున రెండు రాయితీ రుణాల యూనిట్లు మంజూరైనాయని ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో ఒక సెట్ దరఖాస్తు అందించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తాళ్లూరి కృష్ణయ్యకు నివాళి : ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలం కాట్రాయపాడు టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరు సుధాకర్‌నాయుడు తండ్రి అనారోగ్యంతో తాళ్లూరు వెంకట కృష్ణయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి ఆయన భౌతికాయాన్ని దర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాళ్ళ కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరితోపాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

## కోర్టుకు హాజరైన సోమిరెడ్డి

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం రైల్వే కోర్టుకు హాజరయ్యారు. గత ప్రభుత్వంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో అనందయ్య కరోనా మందు పంపిణీ సమయంలో ఏర్పడిన వివాదంలో సోమిరెడ్డిపై కృష్ణపట్నం పోలీసులు క్రిమినల్ కేసు నమోదుచేశారు. అందుకు సంబంధించిన వాయిదాకు ఆయన హాజరయ్యారు. న్యాయమూర్తి మార్చి 24కు వాయిదా వేశారు.

# కలిగిరి తహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

## రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపండి : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి తహసిల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు, గురించి అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే అర్జీదారులకు ఒకటి రెండు రోజుల లోపల ధ్రువీకరణ పత్రాలు అందేవిధంగా చూడాలని తెలిపారు. అర్జీదారుల పట్ల గౌరవంగా మెలగాలని ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని తెలియజేశారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వాటి పరిష్కారం మార్గాలు చూపాలని తెలిపారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పరిష్కారం చేయగలిగినవి వెంటనే పరిష్కరించాలని, మిగిలినవి జిల్లా అధికారుల దృష్టిలో ఉంచి, వాటి ప్రక్రియ సరిగా జరిగే విధంగా చూడవలసిన బాధ్యత మీ పైన ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కూడా కాపాడాలన్నారు. కార్యాలయం సిబ్బంది పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, బాధితుల నుండి వివరాలను సేకరించి వాటి పరిష్కారం మార్గం చూపాలని అధికారులను ఆదేశించారు.

# పాఠశాల అభివృద్ధి కమిటీ, రాజకీయ నాయకులతో సమావేశం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వంలో విద్యాశాఖలో తీసుకువచ్చిన 117 జీవోకు ప్రత్యామ్నాయంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తుందని మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జలదంకి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల మెయిన్‌లో పాఠశాల అభివృద్ధి కమిటీ, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు.. జలదంకి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల మెయిన్‌లో మండల విద్యాశాఖ అధికారులు శ్రీధర్ నాగేశ్వరరావు పాఠశాల అభివృద్ధి కమిటీ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో తీసుకువచ్చిన మార్పులను వారికి తెలియజేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిపే విధంగా లేక అందుబాటులోని పాఠశాలల్లో కలిపే విధంగా మార్పులు తీసుకువచ్చిందని ఆయన తెలిపారు. ఉన్న అవకాశాలను బట్టి మార్పులు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పులిగుంట మధుమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వినోద నాయుడు, మద్దూరు శ్రీనివాసులురెడ్డి, సిఅర్పి రవిచంద్ర, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో మొక్కలు నాటే కార్యక్రమం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వీఎస్‌యూ జాతీయ సేవా పథకం, పినాకిని యూత్ వెల్ఫేర్ వారు సంయుక్తంగా యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర రావు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు మానవ మనుగడకు ఎంతో అవశ్యకమని తెలిపారు. మొక్కలు లేకపోతే మానవ మనుగడికి ప్రమాదమని తెలియజేశారు. ప్రతి ఒక్కరు కూడా పర్యావరణ సమతుల్యతను పాటించడానికి తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న అనేక రకములైన రోగాలకు పర్యావరణ కాలుష్యం కూడా ఒక ముఖ్య కారణమని, కాబట్టి మంచి ప్రాణవాయువు నిచ్చే మొక్కలు నాటితే చాలావరకు అనారోగ్య సమస్యలకు దరిచేరనీయకుండా చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్యాందన్ పాల్గొని మొక్కలను నాటి, మొక్కలలో ఉన్న వివిధ ఔషధ గుణాలను తెలియజేస్తూ ఒక చక్కటి గేయాన్ని కూడా పాడి వినిపించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, పినాకిని యూత్ వెల్ఫేర్ సారథి మురళీమోహన్ రాజు, డాక్టర్ సిహెచ్ వెంకటరాయలు, డాక్టర్ ఎం.హనుమారెడ్డి, డాక్టర్ కోట శ్రీవల్లి ఎంబీఏ విభాగ విద్యార్థులు, తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో తొమ్మిదో వార్డులో టీడీపీ పార్టీకి చెందిన పసుపులేటి కృష్ణ-పద్మావతి వారి కుమారుడు వెంకటరమణ నలుగు కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యేను ప్రేమపూర్వకంగా ఆహ్వానించారు. వారి ఆహ్వానాన్ని అందుకొని శుక్రవారం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నూతన వధూవరులను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆశీర్వదించారు.

## సైదాపురంలో ఇంకుడు గుంతలు నిర్మాణం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 179 సోక్ పిట్స్‌కు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ యొక్క సోక్ పిట్స్ 15వ తేదీలోగా పూర్తిచేయాలని తెలిపారు. అందులో భాగంగా సైదాపురం మండల ఎంపీడీవో ఏడు పంచాయతీలు తీసుకోవడం జరిగింది. వాటిలో తిప్పిరెడ్డిపల్లికి 41, చాగణంకి 31, రామసాగరం 23, ఊటుకూరు 25, గుళించెర్ల 37, పాలూరు 12, పెరుమలపాడు 10, ఒక సోక్ పిట్స్‌కు 6000 రూపాయలు మంజూరు అవుతాయని తెలిపారు. దీనికి సంబంధించి ప్రతి సచివాలయంకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందని ఎంపీడీవో పురుషోత్తం శివ కుమార్ తెలిపారు. ఈ వర్క్‌లో భాగంగా శుక్రవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏపీవో చంద్రయ్య, పంచాయతీ సెక్రటరీ కుమారస్వామి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అలేఖ్య, సోక్ పిట్స్ ఫీల్డ్ వర్కు పరిశీలించడం జరిగిందని తెలిపారు.

## గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు చేయాలి




**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** గ్రామ సమస్యల పరిష్కారం కోసం వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించామని ఉప సర్పంచ్ కనపర్తి నారాయణమ్మ అన్నారు. వరికుంటపాడు మండల పరిధిలోని గణేశ్వర పురం పంచాయతీలో గత కొద్ది రోజుల క్రితం సర్పంచి అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో అభివృద్ధి పనులు కుంటు పడ్డాయని అందుచేత ఉప సర్పంచ్ కనపర్తి నారాయణమ్మ అధ్యక్షతన వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించి గ్రామంలో మౌలిక వసతుల కోసం పలు తీర్మానాలను చేపట్టారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఉపసర్పంచ్‌ను వార్డు నెంబర్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్, టీడీపీ యువ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు బాసటగా కృష్ణ చైతన్య విద్యాసంస్థలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు బాసటగా నిలిచేలా కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రెడ్‌క్రాస్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా వీసీఎస్ఆర్ యూత్ శ్రీను ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీను వారి యువతతో పాటుగా వైసిపి నాయకులు రాజ్ కుమార్, తౌఫిక్ చిన్నారులకు అన్నదానం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తమకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తమకు స్ఫూర్తి అని వారు తెలిపారు.

# ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటా : పట్టాభిరామిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆర్టీసీ కార్మికులకు అండగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఉంటుందని గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నెల్లూరు 2డిపో కమిటీ ఆధ్వర్యంలో స్వాగత సభ యూనియన్ ఆఫీసు నందు నిర్వహించారు. ఈ సభలో నెల్లూరు 2డిపో నందు వైయస్సార్ ఎంప్లాయ్ అసోసియేషన్‌లో కొనసాగుతున్నటువంటి 20 మంది సిహెచ్ కిషోర్ డ్రైవర్, ఎం.సురేష్ డ్రైవర్, ఏ సతీష్ కుమార్ మెకానిక్ గార్ల ఆధ్వర్యంలో ఎన్‌ఎంయుఏలో చేరారు. వీరందరిని ఎన్‌ఎంయుఏ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి చేతులమీదుగా కండువాలు కప్పి మెంబర్షిప్ స్లిప్పులు ఇచ్చి ఆహ్వానించినారు. సభ అంతయు డిపో కమిటీ అధ్యక్షులు యుఎంకె రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు డీఎంకె రెడ్డి డిపో కార్యదర్శి పి.సునీల్ బాబు, గ్యారేజ్ కార్యదర్శి సునీల్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పిఎస్ రెడ్డి మాజీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రఘురామరాజు, జోనల్ కార్యదర్శి కె లుక్సన్ జిల్లా చైర్మన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు తదితరులు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ముందుగా పెద్ద ఎత్తున ర్యాలీ బాణాసంచా కాలుస్తూ పై నాయకులకు స్వాగతం పలికారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల విధానాలు సరళతరం చేయాలి

## సోమిరెడ్డికి రైతు సంఘాల సమైక్య వినతి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు విధి, విధానాలు సరళతరం చేయాలని, ఏపీ రైతు సంఘాల సమైక్య ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమైక్య అధ్యక్షులు చిరసాని కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ప్రధాన మొదటి పంట (లేట్ ఖరీఫ్) వరి కోతలు ప్రారంభమయ్యాని తెలిపారు. అన్ని రకాల ఏ గ్రేడ్ వరి ధాన్యాలకు పుట్టి ధరను తగ్గించి కొంటున్నారని తెలిపారు. ఎంఎస్పి కంటే సుమారు రూ.4వేలు తక్కువ అని తెలిపారు. ఈ పంట కాలంలో చలి ఎక్కువ ఉన్నందువలన దిగుబడులు తగ్గుతున్నాయని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు ప్రారంభంలోనే ధరలు తగ్గించి కొంటున్నారని తెలిపారు. ఈ విధానంతో రానున్న రోజుల్లో వరి ధాన్యం రైతులు తీవ్రంగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతాంగానికి నష్టం వాటిల్లకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ సమైక్య నాయకులు ఏవిఆర్ నాయుడు తదితరులు వినతి ఇచ్చిన వారిలో ఉన్నారు.

# మంత్రి ఆనం పర్యటనను విజయవంతం చేయాలి

## పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో శనివారం స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు ఆత్మకూరులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంత్రి ఆనం ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని, 9.15 గంటలకు సత్రం సెంటర్‌లో స్వచ్ఛఆంధ్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తడిచెత్త, పొడిచెత్త, హ ఓమ్‌కంపోస్టింగ్ అవగాహనా కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని, 10గంటలకు శ్రీ అలఘునాధస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారని, 11గంటలకు ఆర్ అండ్‌బి అతిథిగృహం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి ఆనం పాల్గొంటారని చంద్రారెడ్డి పేర్కొన్నారు. అనంతరం రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడు బధ్రతకు నిబంధనల ప్రచారస్టిక్కర్లను వాహనాలకు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని రామనారాయణరెడ్డి ప్రారంభిస్తారని, తదుపరి ఏపిగురుకల బాలికల పాఠశాలలో మినరల్‌వాటర్ యూనిట్‌ను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంత్రి కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డిలు కోరారు.

# ఘనంగా దామోదర సంజీవయ్య జయంతి వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ వి సుజాత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా దామోదర సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖాధికారి వారి కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా భావం పెంపొందేలా

## రాణా ప్రమోద్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నెల్లూరు జీజీహెచ్‌లో కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల దర్గామిట్ట బాయ్స్ హాస్టల్ క్యాంపస్ విద్యార్థులు పేషెంట్లకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. దర్గామిట్ట కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు. రాణా ప్రమోద్‌రెడ్డి సారథ్యంలో కృష్ణ చైతన్య కళాశాల అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందని తెలిపారు. ప్రస్తుత అకాడమిక్ విద్యలో విద్యార్థులు వారి నైపుణ్యాలు మెరుగుపరచుకొని చదువుకునే విధంగా విద్యా ప్రణాళికలు రూపొందించి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించే దిశగా.విద్యార్థుల ప్రగతికి రాణా ప్రమోద్‌రెడ్డి కారణమవుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డీన్లు రామాంజనేయులు రెడ్డి, రామ్ గోపాల్‌రెడ్డి, పాయసం రమేష్, ప్రిన్సిపాల్ ఉమా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, శ్రీను, ఏడుకొండలు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయం నందు ఆంధ్ర ప్రదేశ్ మొదటి దళిత ముఖ్యమంత్రి అఖిలభారత కాంగ్రెస్ మొదటి దళిత అధ్యక్షుడు స్వాతంత్ర పోరాటం చేసిన దేశభక్తుడు అత్యంత నీతివంతమైన రాజకీయ నాయకులైన శ్రీ దామోదరం సంజీవయ్య 14వ జయంతి జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప వారి సిబ్బంది ఫిబ్రవరి 14వ తేదీ శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రిగా సమర్థవంతమైన పాలన అందించారని ఆయన ప్రతిపను గుర్తించి అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఎన్నుకొన్నారని గుర్రప్ప వివరించారు. అత్యంత ఉన్నత పదవులు చేపట్టినప్పటికీ సొంత ఇల్లు ఆస్తి లేని అత్యంత నిజాయితీ జీవితం గడిపిన మహోన్నత రాజకీయ నాయకుడు దేశభక్తుడు దామోదరం సంజీవయ్య అని ఆయన ఘనతను శ్లాగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అధికారి గురప్ప, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి తదితర సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** కోవూరుపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుండి కావలి వైపుగా వెళుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి క్రింద పడటంతో ఘటనా స్థలంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు కాగా వైద్యం నిమిత్తం కావలి వైద్యశాలకు నేషనల్ హైవే సిబ్బంది తరలించారు. సమాచారం అందుకున్న బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కట్టా నాగరాజు (40) బాపట్ల జిల్లా, చిన్న గంజాంకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు మృతదేహాన్ని కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు

# సీఎం కందుకూరు పర్యటనను విజయవంతం చేయండి



- సజావుగా జరిగేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి
- ఆర్భాటాలు, భారీ జన సమీకరణలు లేకుండా సీఎం సభ
- రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు
- ముఖ్యమంత్రి కృషితోనే జిల్లాలో భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**కందుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరు పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, సబ్ కలెక్టర్ శ్రీ పూజతో కలిసి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఈనెల మూడవ శనివారం కందుకూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని, జిల్లాలో రామాయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం, బీపీసీఎల్ రిఫైనరీ, ఇండోసోల్ సోలార్ ప్యానల్, ఫిషింగ్ హార్బర్ వంటి భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు జిల్లాలో ఏర్పాటు అవుతున్నాయని చెప్పారు. రాబోయే రెండు మూడేళ్లలో జిల్లాకు కందుకూరు పట్టణం గేట్ వేగా మారునుందని చెప్పారు. ఈ మెగా ప్రాజెక్టుల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలతోపాటు కావలి, కందుకూరు పట్టణాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయని చెప్పారు. జల్ జీవన్ మెషిన్ పథకానికి కూడా 8400 కోట్లు జిల్లాకు మంజూరయ్యాయని, త్వరలోనే పథకానికి జలధారా అని పేరు పెట్టి పెద్ద ఎత్తున తాగునీటి పథకాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 300 కోట్లతో రహదారులపై గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. జిల్లాలో పురోగతిలో ఉన్న ఈ ప్రాజెక్టుల వివరాలను కూడా ముఖ్యమంత్రికి అందించేందుకు జిల్లా యంత్రాంగం నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి పర్యటనను ప్రజా ప్రతినిధులు, అధికారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామసభ తరహాలోనే ముఖ్యమంత్రి సభవేదికను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల విభాగాధిపతులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో పూర్తి బాధ్యతతో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. తొలుత కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రదేశం వద్ద ముఖ్యమంత్రి సభా వేదిక ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే నాగేశ్వరరావు, అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిజిపి స్పెషల్ కలెక్టర్ శీనా నాయక్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రావులకొల్లులో ఇంకుడుగుంతలు పరిశీలన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం రావులకొల్లులో శుక్రవారం ఇంకుడుగుంటలను స్థానిక ఎంపిడివో పి.ఐజాక్‌ప్రవీణ్ పరిశీలించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛదివస్ కార్యక్రమం దృష్ట్యా ఆయన పరిశీలించారు. రావులకొల్లులో 11 ఇంకుడుగుంతల ఏర్పాటును చేపట్టారు. వాటిని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధిహామీ పథకం నిధులద్వారా ఈ ఇంకుడుగుంటలను ఏర్పాటు చేస్తున్నామని ఎండివో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 397 ఇంకుడు గుంటలను స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో బాగంగా పూర్తి చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎండివో ఐజాక్‌ప్రవీణ్ చెర్లోయడవల్లి సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ రికార్డులను, హాజరును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు అన్ని సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన సూచించారు. తదుపరి నాగులపాడులోని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని ఆయన సందర్శించి కేంద్ర నిర్వహణకు గాను కార్యదర్శికి ఐజాక్‌ప్రవీణ్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగులపాటి సర్పంచ్ సోమవరపు వెంకటరమణారెడ్డి, ఉపాధిహామీ పథకం ఈసీ జానకి, పంచాయతీ కార్యదర్శి జునైద్, ఎంఆర్‌సి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ అరెస్ట్ : ఎస్ఐ హనీఫ్

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** చాలా రోజులుగా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న ట్రాన్సఫార్మర్ల దొంగను ఎట్టకేలకు పొదలకూరు పోలిసులు శుక్రవారం అరెస్టు చేశారు ఎస్ఐ హనీప్ తెలిపిన వివరాల ప్రకారం పొదలకూరు మండలం, అమ్మవారి పాళెం గ్రామానికి చెందిన కట్టా ప్రసాద్ గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగతనం చేస్తుండేవాడు. పొదలకూరు మండలం, నెల్లూరు గ్రామీణ మండలం, బుచ్చి, టిపి గూడూరు, ముత్తుకూరు, వింజమూరు, వెంకటాచలం మండలాల్లో మొత్తం 27 కేసుల్లో ట్రాన్స్‌ఫార్మర్ వైర్ దొంగతనానికి పాల్పడ్డాడు. పలు మండలాలలో పొలాలలో వరుస దొంగతనాలు చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ ఉండేవాడు, శుక్రవారం నాడు అమ్మవారిపాలెంలో పోలిసులు రెక్కీ నిర్వహించి ఎస్ఐ హనీఫ్ వారి సిబ్బందితో కలిసి కట్టా ప్రసాద్‌ను అరెస్టు చేశారు అతను నుంచి 90 కేజీల రాగి వైరు రూ.1,50,000 రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐతో పాటు స్టేషన్ సిబ్బంది షేక్ షరీఫ్ అక్తర్ భాష, రసూల్ పాల్గొన్నారు.



# పోతిరెడ్డిపాలెం చిత్ర పూజా కార్యక్రమం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో ఉదయం పీఎస్ఆర్ క్రియేషన్స్ బ్యానర్ పై పొంగూరు సుబ్బారెడ్డి నిర్మాతగా, శ్రీనివాసరావు దర్శకుడిగా పోతిరెడ్డిపాలెం చిత్ర పూజా కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ.. ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటూ ఆ తల్పగిరి రంగనాథ స్వామి ఆశీస్సులు చిత్ర నిర్మాణ బృందంపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం చిత్ర బృందం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాణ సభ్యులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇమామ్, మౌజమ్‌ల జీతాలబకాయిలు చెల్లించాలి : ఆవాజ్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మశీదుల్లో నమాజుచేసే ఇమామ్‌లు, మౌజమ్‌లకు గత 10నెలలుగా బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఆత్మకూరుకు చెందిన రాష్ట్ర ఆవాజ్ కార్యదర్శి యస్థాని డిమాండ్ చేశారు. వారికి జీతాలు ఇవ్వనందుకు ఆత్మకూరులో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తూర్పువీధిలోని నూతన మశీదువద్ద యస్థాని ఆధ్వర్యంలో జుమ్మానమాజ్ అనంతరం ఇమామ్‌లు, మౌజమ్‌లతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యస్థాని మాట్లాడుతూ.. పది నెలలుగా ఇమామ్‌లు, మౌజమ్‌కు జీతాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 5వేల రూపాయలు పెంచి బకాయిలను వెంటనే చెల్లించేలా నిధులు విడుదల చేయాలని కోరారు. మశీదుల నిర్వహణకు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రకారం 5వేల రూపాయలను కూడా వెంటనే విడుదల చేయాలని యస్థాని కోరారు. ఈ కార్యక్రమంలో ఇమామ్‌లు, ఆవాజ్ ప్రతినిధులు షేక్ ఆదిల్‌హాజరత్, మస్తాన్, షేక్ అల్లాభక్షు, సయ్యద్ వశీమ్, పి.నాయబ్‌రసూల్, షేక్ రియాజ్, ఎంజి అబ్దుల్లా, సయ్యద్ రహమత్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై సిబ్బందిని నిలదీసిన జెఆర్‌పేట వాసులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని జెఆర్‌పేటలో మేధాస్కూల్‌వీధి ప్రాంత నివాసులు తాగునీటి సమస్య గురించి సచివాలయ సిబ్బందిని శుక్రవారం నిలదీశారు. మున్సిపల్ పైప్‌లైన్ ద్వారా తాగునీరు సక్రమంగా రావడం లేదని, దాంతో తాము ఇబ్బందిపడుతున్నామని వారు పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బందిని కూడా వారు నిలదీసి తాగునీటిని ఎందుకు సక్రమంగా విడుదలచేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పుడే ఇలాగా ఇబ్బందిగా ఉంటే రానున్న వేసవిలో మరింతగా ఇబ్బందిపడేలా ఉన్నామని వారు పేర్కొన్నారు. కమీషనర్ వెంటనే స్పందించి తమ ప్రాంతానికి తాగునీటిని ప్రతినిత్యం సక్రమంగా సరఫరాచేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయాన్ని తాము కమీషనర్ దృష్టికి తీసుకెళతామని సిబ్బంది పేర్కొన్నారు.

## రవాణాకార్యాలయంలో దామోదరం జయంతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి, బహుముఖప్రజ్ఞాశాలి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఆత్మకూరులోని రవాణాశాఖ కార్యాలయంలో మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి రాములు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య ఎలాంటి మచ్చలేని మహానాయకుడని, అత్యంత మేధావి అని, నాయకత్వసమర్ధత కల నాయుకుడని, అందుకే ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దళితుడైన దామోదరంను ముఖ్యమంత్రిగా నిర్ణయించారని రాములు వివరించారు. నిజాయితీ, నిబద్ధత, సమర్ధత, ప్రజ్ఞ కలిగిన సంజీవయ్య రాష్ట్రాన్నిఅత్యంత సమర్ధవంతంగా పాలించారని, ఆయన అత్యంత నిరాడంబరుడని, అత్యంత సాధారణ జీవితం గడిపారని ఎంవిఐ రాములు పేర్కొన్నారు. అలాంటి నేతను స్మరించుకోవడం కర్తవ్యంగా భావిస్తున్నానని రాములు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది, పలువురు వాహనయజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్యకి ఘనంగా నివాళి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా నెల్లూరు రూరల్ ఎంపీడీఓ వి.శైలేంద్ర కుమార్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల విస్తరణాధికారి జె.వెంకట రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అవయవదానంతో.. 6 మందికి ప్రాణదానం..

## మరణించిన డాక్టర్ భూమిక చిత్రపటానికి నివాళి : ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇటీవల హైదరాబాద్ నార్సింగ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యువ డాక్టర్ కుమారి భూమిక హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌కి గురైన విషయం తెలిసిందే. ఆమె అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మేనకోడలు భూమిక బ్రెయిన్ డెడ్‌తో చనిపోవడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పార్వతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ చివరి సంవత్సరంలో భాగంగా హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్న.. డాక్టర్ భూమికకు మొదటి నుంచి సేవ భావం ఎక్కువ. చిన్నప్పటినుంచి చదువులో మంచి ప్రతిభ కనబరిచేది. తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె కావడంతో అల్లారు ముద్దుగా పెరిగిందన్నారు. భూమికకు బ్రెయిన్ డెడ్ కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న కన్న కూతురిని తిరిగి దక్కించుకోవడం సాధ్యం కాదు అని తెలిసి దుఃఖ సాగరంలో ఉన్న ఆమె తల్లిదండ్రులు ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి డాక్టర్ భూమికకు ఉన్న సేవా గుణం ఆశయాలను గుర్తుకు తెచ్చుకొని ఆమె గుండె, ఊపిరితిత్తులు, రెండు కిడ్నీలు, లివర్, కళ్ళను దానం చేసేందుకు ముందుకొచ్చారు. చనిపోతూ కూడా 6 మంది ప్రాణాలు కాపాడిన డాక్టర్ భూమిక ప్రజల మనసులు, గుండెల్లో సజీవంగా నిలబడిందని అభిప్రాయ పడ్డారు. ఒక్కోగానొక్క కూతురు మరణించే స్థితిలో ఉండడాన్ని చూస్తూ బరువెక్కిన హృదయంతో సైతం ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్న డాక్టర్ భూమిక కుటుంబ సభ్యుల నిర్ణయం సమాజానికి స్ఫూర్తి ని ఇస్తుందన్నారు. భూమిక మృతిని వారి కుటుంబ సభ్యులు ఎవ్వరు ఇప్పటికి జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ సందర్భంగా కృష్ణ గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు కాకర్ల వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు జాలి రెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి, అమరనాథ్ రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ నేతలు సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డితో కలిసి డాక్టర్ భూమిక చిత్రపటానికి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. భూమిక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థించారు.

# మహాత్మ జ్యోతిభా పూలే బాలికల గురుకులంలో అవగాహన కార్యక్రమం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మహాత్మ జ్యోతిభా పూలే బాలికల గురుకుల పాఠశాలలో వెంకటాచలం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పి.సుబ్బారావు, పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆడపిల్లల రక్షణ, సమాజంలో వారికి ఎదురయ్యే సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, మహిళా హక్కులు, చట్టపరమైన రక్షణలు, స్వీయరక్షణ పద్ధతులు మొదలైన అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పి.సుబ్బారావు మాట్లాడుతూ.. ఆడపిల్లలు ఎటువంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి. సమాజంలో వారిపై జరిగే అఘాయిత్యాలను తట్టుకుని, చట్టాన్ని ఆశ్రయించి న్యాయం పొందేలా అవగాహన కలిగి ఉండాలి. సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వల్ల చట్టపరమైన సహాయాన్ని పొందవచ్చు. పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి అని తెలిపారు. విద్యార్థులు స్వీయరక్షణ పద్ధతులు నేర్చుకోవడం, హెల్ప్ లైన్ నంబర్లు గుర్తుంచుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రమాద సమయంలో 100 లేదా 1098 (చైల్డ్ హెల్ప్ లైన్) నంబర్లకు కాల్ చేయండి. స్వీయరక్షణ నేర్చుకోవడం ముఖ్యం. ఎవరైనా వేధించినా వెంటనే తల్లిదండ్రులు లేదా గురువుల దృష్టికి తీసుకురావాలి.

# జీవో నెంబర్ 117పై ఎంఈఓలతో ఎమ్మెల్యే సమావేశం



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలోని కలిగిరి మండల ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్య వ్యవస్థలో చేపట్టిన మార్పుల గురించి జరిగిన సమావేశంలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని, ప్రజల దగ్గర నుండి అర్జీల ద్వారా వచ్చిన సమస్యల గురించి పరిష్కారం మార్గయ తెలపాలని అధికారులను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించుట కొరకు స్థానిక నాయకులు కూడా విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను విద్యను అభ్యసించే విధంగా కృషి చేయాలని, విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను అన్వేషించాలని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తమ గ్రామం నుండి పాఠశాల మధ్య దూరం ఒక కిలోమీటర్ దాటిన యెడల ఒక్కొక్క విద్యార్థికి రవాణ ఖర్చుల రూపంలో నెలకు 600 రూపాయలను అందించే విధంగా మార్గదర్శకాలను ఏర్పాటు చేశారని, ఇంకా అవసరమైన సదుపాయాలు సమకూరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిగిరి మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి దినపత్రిక సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

# ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని కావలి యడవల్లి గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. మాజీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఏలూరు మాల్యాద్రి నాయుడు గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామంలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని బీసీ కాలనీలో బ్లీచింగ్ చల్లించుట, ట్రాక్టర్‌తో సోడియం హైపో స్ప్రే చేయటం, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి రాణి, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కుమారుడి

# వివాహ వేడకకు హాజరైన మాజీ సీఎం జగన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కడప నగరంలో మెడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కడప ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై శుక్రవారం వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు విద్యాసంస్థల నాయకులు పాల్గొన్నారు.